క్లుప్తంగా

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : మండలంలోని మినమనముడి గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటే ప్రాంతంలో ఉన్న బాక్స్‌టైప్ బ్రిడ్జిలోని రోడ్డు పై ఏర్పడిన గుంతలకు రైల్వే అధికారుల మరమ్మతులు చేపట్టారు. పక్షం రోజుల కిందట సాక్షి దిన పత్రికలో ఈ రోడ్డు దుస్థితిపై కథనం ప్రచురితమైంది. దీనిపై రైల్వే అధికారులు స్పందించారు. గుంతలను పూర్తి స్థాయిలో పూడ్చి మరమ్మతులు చేస్తున్నారు. అదే విధంగా బ్రిడ్జిలోకి వర్షపు నీరు, పొలాల్లోని సాగు నీరు బ్రిడ్జిలోకి రాకుండా కాలువను సైతం నిర్మిస్తున్నారు.

కారు స్వాధీనం
– ఒకరి అరెస్టు



కారును, నిందితుడిని చూపుతున్న అటవీశాఖ అధికారులు

రాపూరు: మండలం తెగచర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును స్వాధీనం చేసుకుని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు రాపూరు అటవీశాఖ రేంజర్ రవీంద్ర బాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ పెంచలకోన బ్రహ్మోత్సవాల సమయంలో అడవుల్లోకి ఎర్రచందనం నరికేందుకు తమిళనాడు కూలీలు వస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. నాలుగు రోజులుగా అనుమానాస్పద ప్రదేశాల్లో అటవీ, తిరుపతి టాస్క్‌ఫోర్స్, బేస్ క్యాంప్ సిబ్బంది బృందాలుగా ఏర్పడి నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున తెగచర్ల సమీపంలోని మల్లమ్మబాట వద్ద కారును అడ్డుకున్నామని తెలిపారు. కారులో ఉన్న నలుగురిలో ఒకరు పరారయ్యారని, ఒకరిని పట్టుకున్నట్టు పేర్కొన్నారు. అతను తమిళనాడులోని రాయవేలూరుకు చెందిన వాడిగా గుర్తించామన్నారు. కారులో వంట సామగ్రి ఉందని, వారు అడవిలో ఎర్రచందనం నరికేందుకు వచ్చినట్టు గుర్తించామన్నారు. కారును, వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అప్పగించినట్టు వెల్లడించారు. దాడుల్లో గోనుపల్లి, కలువాయి డీఆర్‌వో మస్తానయ్య, బాలాజీ, ఎఫ్‌బీవో ప్రవీణ్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు రూ.300 కూలి వచ్చేలా పనులు

చిల్లకూరు : ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 వేతనం అందేలా పనులు కల్పించాలని జిల్లా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఆయన శనివారం నెలబల్లిరెట్టపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడి ఎంత మేర కొలతలు తీస్తున్నారు, కూలి ఎంత వస్తోంది తదితర వివరాలు తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రిజిస్టర్లలో ప్రతి విషయాన్నీ నమోదు చేయాలని సూచించారు. ఉపాధి ఏపీడీ చంద్రశేఖరరాజు, ఏపీవో గిరిబాబు, జేఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 15 మంది గైర్హాజరు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ ఇంగ్లీష్, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 430 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. 15 మంది గైర్హాజరైనట్టు చీఫ్ మల్లికార్జున తెలిపారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్, ఒకేషనల్ పరీక్షలకు 49 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి నాయుడుపేట పట్టణంలోని మూడు కేంద్రాల్లో హిందీ పరీక్షలు జరిగాయి. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 32 మంది విద్యార్థులకు గాను ఒకరు హాజరైనట్లు ఎంఈవో మునిరత్నం తెలిపారు. ఎల్ఏ సాగరం ఉన్నత పాఠశాలలో 44 మంది విద్యార్థులకు గాను ఆరుగురు హాజరైనట్టు తెలిపారు. నారాయణ హైస్కూల్‌లో 48 మందికి 2 మాత్రమే పరీక్షలు రాసినట్లు వెల్లడించారు.

29న మండల సమావేశం

చిట్టమూరు(చిల్లకూరు) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 29న ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో నాగరాజు తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉన్నందున ఆర్థిక పరమైన విధాన నిర్ణయాలు తప్ప మిగిలిన అంశాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష ఉంటుందని తెలిపారు.

కడివేడులో ఇంట్లో చోరీ

చిల్లకూరు: మండలంలోని కడివేడులో శుక్రవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బుర్రి వెంకటరమణయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి మిద్దెపైన నిద్రించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని బ్రాస్ లేట్, జత కమ్మలు, రెండు ఉంగరాలు మొత్తం 20 గ్రాముల బంగారు వస్తువులు, రూ.35 వేల నగదు చోరీ చేశారు. శనివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ సిరాజ్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అంగరంగ వైభవం.. చెన్నకేశవుడి రథోత్సవం



రథాన్ని లాగేందుకు పోటీ పడుతున్న మహిళలు



విమానోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు రూరల్ : గూడూరులోని బజారు వీధులు శనివారం హరినామ స్మరణలతో మారుమోగాయి. పట్టణంలోని బొడ్డు చౌక్ ప్రాంతంలో వెలసిన చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చివరి రోజు స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం ఆలయ కమిటీ సభ్యులు నూతన రథాన్ని తయారు చేయించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు స్వామి వారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. ఇంటి ముంగింటకు వచ్చిన రథం ముందు మహిళలు నీరు పోసి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కరిమాణిక్య స్వామి విమానోత్సవం

నాయుడుపేట టౌన్ : తుమ్మూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామి వారి విమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీరి గ్రామంలో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ముంగిటా స్వామి వారిని ఆహ్వానిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయం వద్ద స్వామి వారి చప్పర ఉత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు శేషాద్రి స్వామి, కిషన్ స్వామి ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, సహస్ర నామార్చన, బలిహరణం నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంత సేవ చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి, గ్రామ పెద్దలు, మాజీ ఆలయ ట్రస్టీ కామిరెడ్డి రామకృష్ణారెడ్డి, కామిరెడ్డి మోహన్‌రెడ్డి, నరసారెడ్డి, పసల గంగాప్రసాద్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి కల్యాణోత్సవం

కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారిజాము వరకు కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అలాగే సోమవారం ఉదయం చప్పర ఉత్సవం, సాయంత్రం స్వామి వారు మోహిని అవతారంలో సింహ, గజ వాహనాల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారని పేర్కొన్నారు.



ఊంజల్ సేవ చేస్తున్న వేద పండితులు

లక్ష్మీనరసింహస్వామికి పల్లకి సేవ

చిల్లకూరు : మండలంలోని కలవకొండలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరు రోజులు ఆలయంలో విశేష పూజలు చేశారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు సుప్రభాత సేవ చేశారు. విశేష అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా బల్లవోలు గ్రామానికి చెందిన దువ్వూరు చెంచుకిరణ్‌రెడ్డి, జోహిత దంపతులు వ్యవహరించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ రత్నశేఖర్

వెంకటగిరి రూరల్ : పుస్తక పఠనంతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని రిసోర్స్ పర్సన్ రత్నశేఖర్ తెలిపారు. ఆయన శనివారం వెంకటగిరి తూర్పువీధిలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ఈ నెల 7వ తేదీ వరకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన పిల్లలను సంరక్షించాలి



మాట్లాడుతున్న జడ్జి సులోచనరాణి

గూడూరు రూరల్ : పలు ప్రాంతాల్లో చిన్న పిల్లలు తప్పిపోతుంటారని, అలాగే కొందరు తల్లిదండ్రుల మీద అలిగి వెళ్లిపోతుంటారని గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ సులోచన రాణి తెలిపారు. వారిని గుర్తించి సంరక్షించాలని సూచించారు. ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా ఆమె శనివారం గూడూరు కోర్టు ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లల ఆలోచన విధానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించాలని పేర్కొన్నారు. కొంత మంది పిల్లలు ఇళ్లు వదలి వెళ్లిపోయి ఎక్కడ పడితే అక్కడ ఆశ్రయం పొందుతుంటారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి హోంలు, కేర్ సెంటర్లు, వీలైతే వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని సూచించారు. తప్పిపోయిన పిల్లలతో కొంతమంది భిక్షాటనతోపాటు కూలి పనులు చేయిస్తున్నారని వాపోయారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. రోడ్డుపై పిల్లలు తిరుగుతుంటే పోలీస్ స్టేషన్, కోర్టుకు సమాచారం ఇవ్వాలని కోరారు. కోటేశ్వరరావు, కొండలరావు, ఎండీ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మూసేయడంపై గ్రామస్తుల ఆగ్రహం



రోడ్డులో వేసిన గ్రావెల్ తొలగించిన గ్రామస్తులు

పెళ్లకూరు: పాలచ్చూరు గ్రామం వద్ద గ్రావెల్ పోసి కోనేటిరాజుపాళెం–కొణతనేరి ఆర్‌అండ్‌బీ రోడ్డును మూసివేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనేటిరాజుపాళెం, కొణతనేరి గ్రామాల మధ్య సుమారు 19 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు ఉంది. ఈ మార్గంలో కొణతనేరి, పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు, అనకవోలు, పెరుమాళ్లపల్లి, జంగాలపల్లి, పాలచ్చూరు, కోనేటిరాజుపాళెం గ్రామాలు ఉన్నాయి. మేనకూరు సెజ్‌లో ఉన్న పలు పరిశ్రమలలో పని చేసే ఉద్యోగులు, కార్మికులు ఈరోడ్డు ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. చాలా కాలంగా ఏపీఐఐసీ అర్‌అండ్‌బీ రోడ్డును మూసివేయాలనే ప్రయత్నాలు చేస్తోందని ప్రజలు ఆరోపించారు. ఈ క్రమంలోనే వాహనాలు, పాదచారులు వెళ్లకుండా రోడ్డుకు అడ్డంగా గ్రావెల్ వేసినట్టు వాపోయారు. పాలచ్చూరు సర్పంచ్ పెళ్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు మాధవరెడ్డి, సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు గ్రావెల్‌ను యంత్రాలతో తొలగించారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ పరమేశ్వరిని వివరణ కోరగా రోడ్డు మూసివేసేందుకు ఐపీఐఐసీకి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఈ విషయమై పూర్తిగా విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనూష

దక్కిలి : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అనూష తెలిపారు. ఆమె శనివారం చెన్నసముద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలకు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని పేర్కొన్నారు. మహిళలు, బాలికలకు రక్షణగా చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.రాజేష్, రాజారాం, సునీత తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న చెంగల్‌రాయులురెడ్డి

నాయుడుపేట టౌన్ : మండలంలోని మర్లపల్లి జాతీయ రహదారి కూడలి సమీపంలో శనివారం సాయంత్రం బైక్‌ను లారీ ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగకు చెందిన చెంగల్‌రాయులురెడ్డి బైక్‌లో గూడూరు నుంచి శ్రీకాళహస్తి వెళుతున్నాడు. మర్లపల్లి సమీపంలోని జాతీయ రహదారిలో లారీ ఢీకొంది. చెంగల్‌రాయులురెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అటువైపు వస్తున్న వారు గుర్తించి నిలపకుండా వెళుతున్న లారీని వెంబడించి నాయుడుపేట జాతీయ రహదారి కూడలి వద్ద పట్టుకున్నారు. అనంతరం గాయపడిన వ్యక్తిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడికి వచ్చిన ఏఎస్ఐ అతనికి సంబంధించిన వ్యక్తులు వచ్చిన తరువాత చెప్పండి అంటూ వెళ్లిపోయారని, బాధితుడిని వివరాలు తెలుసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అయనపై సీఐ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేశారు. బాధితుని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని అతన్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరామిక్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సిరామిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గూడూరు రూరల్ : సిరామిక్ కళాశాలలోని డిప్లొమా కోర్సులు చేయడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని కోర్సుల్లో చేరితే ఎలాంటి ఉద్యోగాలు లభిస్తాయి, ఎలాంటి భవిష్యత్తు ఉంటుందన్న విషయాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సిరామిక్ ద్వారా పలు రకాల కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇక్కడ చదివిన వారు దేశ విదేశాల్లోని సిరామిక్ పరిశ్రమలలో పని చేస్తూ మంచి జీతాలు పొందుతున్నారని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ గూడూరు డీఎస్పీ రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆజాద్ జాకీర్, సిరామిస్టు సురేంద్ర రెడ్డి, సుబ్రమణ్యం, కళాశాల విభాగాధిపతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీకి రోజులు చెల్లాయి



మాట్లాడుతున్న చింతామోహన్

గూడూరు రూరల్ : దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల్లో బీజేపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, త్వరలోనే కేంద్రంలో బీజేపీకి రోజులు చెల్లిపోనున్నాయని తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ తెలిపారు. ఆయన శనివారం గూడూరులో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో విచ్చలవిడిగా నగదు పంపిణీ చేపట్టారని ఆరోపించారు. దాడులు, ప్రతిదాడులు, నగదు, మద్యం పంపిణీ జరుగుతున్నా పోలీసు, ఎన్నికల కమిషన్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారని దుయ్యబట్టారు. డాక్టర్ రామక్రిష్ణారావు, పూల చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన ఆత్మగౌరవ పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీన గుర్తు తెలియని దుండగులు అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని తెలిపారు. ఇప్పటి వరకు దుండగులను గుర్తించి అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజా సంఘాల నేతలు గుండవోలు గోపాల్, రామకృష్ణ, జాషువా, ధనుంజయ, సురేష్, ఉదయ్, భాస్కర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

బాలాయపల్లి (సైదాపురం) : ఉపాధి కూలీలకు రోజుకు రూ.300 కూలి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. ఆయన శనివారం జయంపు గ్రామంలో జరుగుతున్న మినీ అమృత్ సరోవర్ పనులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ఉండేలా చొరవ చూపాలన్నారు. పనులు జరిగే సమయంలో కూలీలకు తగిన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఏపీవో ఎస్ మృత్యుంజయ, ఈసీ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

చిల్లకూరు : సాగరమాల రోడ్డు నిర్మాణానికి మట్టి, గ్రావెల్‌ను కాంట్రాక్టు సంస్థ కలవకొండ సమీపంలో అక్రమంగా తవ్వుతున్నట్టు ఫిర్యాదులు అందడంతో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు శనివారం రాత్రి చిల్లకూరు ఆర్ఐ రమ్యస్వాతి, వీఆర్వో అడ్డుకున్నారు. సాగరమాల రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ బయటి నుంచి మట్టి, గ్రావెల్ తెచ్చుకుని పనులు చేసుకోవాల్సి ఉంది. సంస్థ ప్రతినిధులు ఆయా గ్రామాల్లోని పేదల భూములపై కన్నేసి వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదులు వెల్లడంతో పనులు నిలిపివేశారు. అనంతరం ఒక లారీని పోలీసులకు అప్పగించారు.

పోలేరమ్మ జాతరలో వీఐపీ పాసులు రద్దు

- ఇతరులకు చందాలు ఇవ్వొద్దు
- విరాళానికి అధికారుల నుంచి రశీదు పొందాలి



మాట్లాడుతున్న దేవదాయ శాఖ ఈవో శశాంక్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర సందర్భంగా వీఐపీ పాసులను రద్దు చేస్తున్నట్టు స్థానిక దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి శశాంక్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పోలేరమ్మ జాతరను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు దేవదాయ, పోలీసు, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. జాతరకు సంబంధించి కొంతమంది ప్రయివేటు వ్యక్తులు చందాలు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. చందాలు వసూలు చేసేందుకు ఎవరినీ నియమించలేదన్నారు. దాతలు అమ్మవారికి సమర్పించే చందాలు, ముడుపులను తమ శాఖ పరిధిలోని హుండీల్లో గాని, తమకు గాని అందజేసి రశీదు పొందాలని సూచించారు. అదే విధంగా పోలేరమ్మ జాతర సంబంధించి విరాళాలను ఆన్‌లైన్‌లోనూ చెల్లించవచ్చన్నారు. ఆలయం వద్ద ఉన్న గూగుల్ పే, ఫోన్ పే తదితర స్కానర్ల ద్వారా కూడా అందజేసి పోలేరమ్మ ఆశీస్సులు పొందవచ్చని పేర్కొన్నారు. జాతర సందర్భంగా ప్రత్యేక దర్శనానికి రూ.100 టికెట్లు పెడుతున్నట్టు వెల్లడించారు. వీఐపీ పాసులు రద్దు చేశామన్నారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, గర్భిణులు జిల్లా అధికారులు తదితరుల కోసం ప్రత్యేక దర్శనం కల్పిస్తామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి

నాయుడుపేట టౌన్ : ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులను సమావేశపరిచి ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఓట్ల లెక్కింపు రోజున గొడవలకు పాల్పడకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గొడవలకు పాల్పడబోమని, కలిసిమెలసి ఉంటామని ప్రతిజ్ఞ చేయించామన్నారు. నేరచరిత్ర ఉన్న వారిని బైండోవర్ చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా అన్ని పార్టీల నాయకులు తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కోరారు. జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా గొడవలకు దిగితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలింత మృతిపై గోప్యంగా విచారణ

గూడూరు రూరల్ : బాలింత మృతిపై జిల్లా వైద్యాధికారులు శనివారం గోప్యంగా విచారణ చేపట్టారు. ప్రసవం కోసం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన గర్భిణి శుక్రవారం బిడ్డను ప్రసవించిన అనంతరం మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతిచెందిందని భర్త, కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ నిరసన తెలిపారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో డాక్టర్ ఆనందబాబు నేతృత్వంలోని జిల్లా వైద్యాధికారులతో కూడిన కమిటీ శనివారం గూడూరు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టింది. దీనిపై మీడియాకు కూడా సమాచారం ఇవ్వకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జిల్లా వైద్యాధికారి శ్రీహరి, గూడూరుకు చెందిన డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మకు ఫోన్ చేసినా స్పందించలేదు. సహచర ఉద్యోగులను కాపాడుకునేందుకే గోప్యంగా విచారణ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దు

కడప కోటిరెడ్డి సర్కిల్: క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోకుండా సమస్యకు పరిష్కారం వెతుక్కోవాలని రైల్వే రక్షక దళం సీఐ శ్రీనివాసులు సూచించారు. ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం కాపాడారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ వెంకటగిరికి చెందిన అశోక్‌కుమార్ భార్య అంజలి శుక్రవారం భర్తతో గొడవ పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. భర్త అశోక్ కుమార్ ఆమెను వెంబడించాడు. బాధితురాలు రేణిగుంట రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగి ఎక్కి వెళ్తుండగా.. ఆమెను కాపాడాలని అశోక్‌కుమార్ టోల్ ఫ్రీ నంబర్ 139 (రైల్ మదత్)కు ఫోన్ చేశాడు. వారు కడప ఆర్‌పీఎఫ్ పోలీసులకు విషయం చేరవేశారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ కడపకు చేరుకోగానే ఆర్‌పీఎఫ్ పోలీసులు అంజలి కోసం గాలించారు. కడప రైల్వే స్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆమెను గుర్తించారు. ఈ విషయాన్ని అశోక్‌కుమార్‌కు తెలియజేయడంతో అతను అక్కడికి వెళ్లాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళ ప్రాణాలు కాపాడిన ఎస్ఐ నాగభూషణం, కానిస్టేబుళ్లు గోవిందరెడ్డి, అతిరా, హరిలాల్ మీనాను సీఐ శ్రీనివాసులు అభినందించారు.